క్లుప్తంగా

గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ లైన్ పనులు

సీతానగరం: వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలనే ఉద్దేశంతో విద్యుత్ శాఖాధికారులు గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నారు. మండలంలోని బక్కుపేట, తామరఖండి, కొత్తవలస, బగ్గందొరవలస, బల్లకృష్ణాపురం, గెద్దలుప్పి గ్రామాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు, తీగలు వేయడం పూర్తయింది. పనులు పూర్తయితే ఇకపై నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. అలాగే పంపుసెట్లు, పరిశ్రమలకు వేర్వేరు లైన్లు వేయనున్నట్లు చెప్పారు.

పెదబోగిలి మాజీ సర్పంచ్ మృతి



లంక రాములు (ఫైల్)

సీతానగరం: మండలంలోని పెదబోగిలి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లంక రాములు ఆదివారం ఉదయం మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములు బెంగుళూరులో ఉన్న కుమారుడి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రాములు భార్య లక్ష్మి కూడా సర్పంచ్‌గా పనిచేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- రూరల్ సీఐ రవికుమార్



రవికుమార్, రూరల్ సీఐ

పార్వతీపురం టౌన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై అనునిత్యం నిఘా ఉంటుందని.. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు జూన్ 4న ఉంటుందని, ఎవరైనా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగితే చట్టపరంగా శిక్షిస్తామన్నారు. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చామని, వారు సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు కొనసాగుతాయని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పాలకొండ–విశాఖ, పార్వతీపురం రహదారుల్లోని చెక్‌పోస్టుల వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేయడంతో పాటు వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. నగదు, మద్యం, నిషేధిత గుట్కాలు, మత్తు పదార్థాల రవాణాకు యత్నిస్తే కేసులు తప్పవన్నారు. నగదు, ఆభరణాలు తీసుకువెళ్లేవారు సంబంధిత ధ్రువపత్రాలను కచ్చితంగా తమ వద్ద ఉంచుకోవాలని, లేదంటే వాటిని సీజ్ చేయాల్సి వస్తుందన్నారు.

పంపిణీకి విత్తనాలు సిద్ధం

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, పంపిణీకి వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో విజయభారతి తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి చేరిన విత్తనాలను ఆమె ఆదివారం పరిశీలించి, కాసేపు మాట్లాడారు. ఎంటీయూ 1064 రకం విత్తనాలు 1900 క్వింటాళ్లు, స్వర్ణమసూరి రకం విత్తనాలు 300 క్వింటాళ్లు, సాంబమసూరి రకం విత్తనాలు 300 క్వింటాళ్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, ఈ మేరకు అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. వీరఘట్టం రహదారిలో అగ్నిప్రమాదాలపై ఆదివారం ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినపుడు చేపట్టాల్సిన తక్షణ చర్యలను వివరించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్, గ్యాస్, పెట్రోల్, కిరోసిన్ వంటి మండే గుణం కలిగిన వాటి వినియోగంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

పాలకొండ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదన్నారు. అయినప్పటికీ అన్ని శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న పనుల తాజా స్థితిగతులు, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలతో కూడిన సమగ్ర సమాచారంతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం వద్దు

వీరఘట్టం: మరి కొద్ది రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున విద్యార్థులకు కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉన్నందున వీఆర్వోలు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కె. జయప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సచివాలయాల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి ఫార్వర్డ్ చేసి ధ్రువపత్రాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

ఆర్‌బీకేలు రైతు నేస్తాలు..

- విత్తనం నుంచి ఎరువు వరకు అన్నీ అందుబాటులోనే
- మండలంలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలు 20
- మొత్తం రైతులు 10, 245 మంది
- 5, 850 హెక్టార్లలో వరిసాగు
- రైతుభరోసా పొందిన రైతులు 9,696
- వారికి చేకూరిన లబ్ధి రూ. 13.08 కోట్లు



పెదంకలాం ఆర్బీకే కేంద్రం

సీతానగరం: రాష్ట్రంలో 2019 నాటికి ముందున్న పాలకులు రైతులను పట్టించుకున్న దాఖలాలే లేవు. పైగా వ్యవసాయమే దండగ అన్న ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం అందక.. వ్యవసాయం చేయలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి అన్నదాతకు అండగా నిలిచారు. రైతు సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు. విత్తు నుంచి ఎరువు వరకు అన్నీ అందుబాటులో లభించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు రైతులకు నేస్తాలుగా మారాయి. సాగుకు సంబంధించిన అన్ని సలహాలు, సూచనలను సిబ్బంది అందిస్తున్నారు. పంట పండిన తర్వాత దిగుబడులను కూడా నేరుగా కొనుగోలు చేస్తూ రైతుకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకుంటున్నారు.

గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు..

గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. వీరు వెళ్లిన సమయానికి అక్కడ అధికారులుంటే పర్వాలేదు.. లేదంటే ఊసురోమంటూ వెనుదిరిగి మరోసారి మండల కేంద్రానికి పయనమవ్వాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామంలోనూ ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడంతో రైతులు సొంత గ్రామంలోనే అన్ని రకాల సేవలు పొందగలుగుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా మారింది.



కాశీపేట ఆర్బీకేలో పచ్చిరొట్ట విత్తనాలు



పెదబోగిలి ఆర్బీకేలో పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

మార్కెట్ ధరకంటే తక్కువ..



జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై అందజేస్తున్నాం. మార్కెట్ ధర కంటే తక్కువే ఇస్తున్నాం. అలాగే భూసార పరీక్షలు చేస్తూ, పొలాలకు ఏయే ఎరువులు వేయాలో వివరిస్తున్నాం. – ఎస్.అవినాష్, ఏఓ, సీతానగరం

కియోస్క్ యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు..

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు 48 గంటల్లోనే నేరుగా రైతులకే అందుతున్నాయి.

ఎరువులు, విత్తనాలు, యంత్రాల పంపిణీ

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, వరి విత్తనాలు ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై అందజేస్తున్నారు. రైతాంగానికి అవసరమైన ఎరువులు ముందుగానే పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల ద్వారా సమకూర్చడానికి వ్యవసాయ శాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రైతుభరోసా వస్తోంది..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి వ్యవసాయ పెట్టుబడి కింద రైతుభరోసా డబ్బులు వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు అవసరమై పచ్చిరొట్ట, వరి విత్తనాలు ఆర్బీకేల్లోనే రాయితీపై పంపిణీ చేస్తున్నారు. ఆర్‌బీకేలు ఏర్పాటుతో ఎన్నో ఇబ్బందులు తీరాయి.

– బక్కు సూర్యనారాయణ, రైతు, బక్కుపేట, సీతానగరం

సకాలంలో ఎరువులు, విత్తనాలు..



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు కోల్పోతే నష్టపరిహారం కూడా అందిస్తూ ఆదుకుంటున్నారు. సాగుకు సంబంధించిన అన్ని సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

– బొన్నాడ తిరుపతిరావు, రైతు, గాదెలవలస

సారా విక్రయాలపై నిఘా..



పాతరెల్లి వీధిలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ కృష్ణారావు, సిబ్బంది

- సీఐ కృష్ణారావు
- 15 వాహనాలు, 360 ప్యాకెట్ల సారా సీజ్

పార్వతీపురం టౌన్: సారా రవాణా, అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తామని పట్టణ సీఐ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని పాత రెల్లివీధి ప్రాంతంలో పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత రెల్లివీధిలో సారా నిల్వ కేంద్రాలు ఉన్నాయన్న ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 15 ద్విచక్ర వాహనాలు, 360 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సారా విక్రయిస్తున్న అనుమానితులను గుర్తించామన్నారు. సారా అమ్మకాలు, రవాణా, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టణ ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో సారా అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రవీంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..

- స్కూల్ బస్సులు నడిపే వారికి నిబంధనలు తప్పనిసరి
- ఎంవీఐ శశికుమార్

పార్వతీపురం టౌన్: బడి బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎంవీఐ శశికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా డ్రైవ్ చేస్తారన్నారు. బస్సు లోపల, బయట పూర్తిగా పరిశీలించిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని చెప్పారు. జిల్లాలో 85 వరకు స్కూల్ బస్సులు ఉండగా వాటికి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహన లైసెన్స్ ఉండాలన్నారు.

అలాగే పూర్తి ఆరోగ్యంతో 60 ఏళ్ల లోపున్న వారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలని సూచించారు. డ్రైవర్, సహాయకుడు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు.



బస్సు వాహన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ శశికుమార్

రూ.కోటితో మూలవలసకు బీటీ రోడ్డు



మూలవలసకు వేసిన బీటీ రోడ్డు

సాలూరు రూరల్ : మండలంలోని నార్లవలస పంచాయతీ మూలవలస గ్రామానికి కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించారు. గతంలో ఈ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గిరిశిఖర గ్రామాలకు తాగునీరు, రహదారి, పక్కా ఇళ్లు వంటి వసతులు కల్పించారు. ఈ క్రమంలో మూలవలసకు రోడ్డు వేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొమరాడ: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని మార్కొండపుట్టి, చంద్రంపేట, పరశురాంపురం గ్రామాలను ఆయన ఆదివారం సందర్శించి, అక్కడి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో తగాదాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు గ్రామాలను సందర్శిస్తున్నామని, ఎన్నికల నిబంధనలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై తీసుకునే చర్యలను వివరిస్తున్నామని తెలిపారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వస్తాయని, ఆరోజు ఏ గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలని గ్రామపెద్దలకు సూచించారు. ఎవరైనా గొడవలు పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.



మార్కొండపుట్టిలో గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ రవికుమార్

నకిలీ విత్తు.. రైతు చిత్తు..

- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు
- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు



విత్తనాలు విక్రయించే దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

పార్వతీపురం టౌన్: రుతు పవనాలు వచ్చే సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ కోసం పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి పంటే ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది వరి పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే రాయితీ విత్తనాలే కాకుండా రైతులు ప్రైవేట్ దుకాణాల్లో లభించే విత్తనాలపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతున్నారు. నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో తగిన సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించొచ్చని, నష్టపోయినా పరిహారం సైతం పొందచ్చని చెబుతున్నారు.

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకూ రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

పరిహారం పొందడం సులువే..



విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందొచ్చు. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

– అశోక్, మండల వ్యవసాయాధికారి, పార్వతీపురం

ఊరంతా ఆకు కూరలే..

- ఆకుకూరల సాగుకు కేరాఫ్ దశుమంతపురం
- సేంద్రియ ఎరువులతోనే పంటల సాగు
- మార్కెట్లో మంచి డిమాండ్



మార్కెట్‌కు కాయగూరలు తీసుకువెళ్తున్న మహిళలు

వీరఘట్టం: మనం తినే పౌష్టికాహారాల్లో ఆకుకూరలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సామాన్యుల నుంచి ధనికుల వరకు ఆకుకూరలు తీసుకునేందుకు ఇష్టపడతారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు రోగులు, గర్భిణులు, బాలింతలు, క్షతగాత్రులు ఆకుకూరలు తినాలని వైద్యులు సూచిస్తుంటారు. ఆకుకూరల్లో విటమిన్–ఎ ఎక్కువగా లభ్యమవుతుంది. వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆకుకూరలను చాలా చోట్ల రసాయన ఎరువులతో పండిస్తున్నారు. అయితే వీరఘట్టం మండలంలోని దశుమంతుపురం గ్రామానికి చెందిన పొందర కులస్తులు మాత్రం సేంద్రియ ఎరువులతోనే ఆకుకూరలను పండిస్తున్నారు. సమీప గ్రామాల ప్రజలకు ఈ ఆకుకూరలను అందుబాటులో ఉంచుతూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

5 ఎకరాల్లోనే సాగు..

మండలంలోని దశుమంతపురం గ్రామం ఆకుకూరల సాగుకు ప్రసిద్ధి. ఇక్కడి రైతులు పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వీటిని సాగుచేయడంతో చుట్టపక్కల గ్రామాల్లో ఈ పంటలకు మంచి డిమాండ్ ఉంది. గ్రామంలో పొందర కులానికి చెందిన 70 కుటుంబాల రైతులు 5 ఎకరాల్లో చిన్న చిన్న కమతాలు ఏర్పాటు చేసుకుని ఉల్లికాడలు, తోటకూర, గోంగూర, బచ్చలికూర, పాలకూర, కొత్తిమీర, చుక్కకూర, సొత్తుకూర, ఓం పువ్వు, తదితర ఆకుకూరలను పండిస్తున్నారు. తక్కువ పెట్టుబడి, నెల రోజుల్లోనే పంట చేతికి రావడం, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఆకుకూరల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రోజూ పంట చేతికి వస్తుండడంతో వీరఘట్టం, సంత–నర్సిపురం, మహదేవివలస, చలివేంద్రి, గోపాలపురం, జియ్యమ్మవలస, పెద్దబుడ్డిడి తదితర గ్రామాలకు తీసుకువెళ్లి విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. అలాగే పెద్ద పెద్ద ఫంక్షన్లు చేసుకునేవారు ఇక్కడకు స్వయంగా వచ్చి ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోజుకు రూ.1000 వరకు లాభాలు పొందుతూ ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



సొత్తికూర

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

ఇక్కడ రైతుల పరిస్థితిని స్థానిక సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఉద్యానవన శాఖ అధికారులు గ్రామంలో సాగులో ఉన్న ఆకుకూరల పంటలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, సబ్సిడీపై విత్తనాలు అందించారు. అలాగే రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి సాగుకు మరింత సాయం అందించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సాగులో ఉన్న ఉల్లికాడలు

రెల్లివీధిలో కార్డన్‌సెర్చ్

- 13 ద్విచక్ర వాహనాలు సీజ్



రెల్లివీధిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి నేతృత్వంలో సర్కిల్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టారు. స్థానిక రెల్లివీధిలో పలువురు ఎస్సైలు ఇంటింట తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల గుర్తింపు, మద్యం, సారా, నిషేధిత మత్తు పదార్థాల నిల్వలపై దృష్టిసారించారు. వీధుల్లో క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. అప్పటివరకూ 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ విషయాలను గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట ఎస్సైలు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఫక్రుద్దీన్, జగదీష్ నాయుడు తదితరులున్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మొండెంఖల్ గ్రామంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 లీటర్ల సారా, ఎటువంటి ధ్రువపత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు, కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.